క్లుప్తంగా

నేడు 'స్పందన'

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ప్రజలు అర్జీల ద్వారా తెలియజేయాలని కోరారు. వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. సెలవు దినంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావటంతో గ్రామంలో ట్రాఫిక్ అవరోధాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారికి బోనాల సమర్పణ



నందిగామ: మండలంలోని అంబారుపేట గ్రామంలో శ్రీ సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం అమ్మవారికి విశేష పూజలతో పాటు పలు రకాల హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో అమ్మవారికి గ్రామ బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రబల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపమ్మ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం విశాఖపట్నం జిల్లా, అనకాపల్లికి చెందిన ధూళిపాళ్ల వెంకటలక్ష్మణ్‌కుమార్ రూ.13,000 ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

వీరులపాడు: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సోమేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో సిబ్బందితో కలిసి ఆయన ఆదివారం తెల్లవారుజామున దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గ్రామ పార్టీ కన్వీనర్‌గా జొన్నాబొట్ల సతీష్ శర్మను ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమలేష్, చలమల శ్రీనివాసరావు, గుర్రం నరసింహారావు, నాగరాజు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

జగ్గయ్యపేట అర్బన్: ఊపిరితిత్తుల వ్యాధితో బాధ పడుతున్న 6 నెలల పసి పాపకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వత్సవాయి మండలం, కంభంపాడు గ్రామానికి చెందిన బేతంపూడి గోపి, సుప్రియ దంపతుల ఆరు నెలల పసిపాప ఊపిరితిత్తుల వ్యాధితో బాధ పడుతూ విజయవాడలోని అంకూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని సదరు గ్రామ నాయకులు ఎమ్మెల్యే ఉదయభాను దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేలను ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ నాయకులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాలిక విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మరింతగా సాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

అక్కచెల్లెమ్మల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- వైఎస్సార్ ఆసరా సంబరాలు



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, చిత్రంలో ప్రభుత్వ విప్ ఉదయభాను, విమలాభాను, పార్టీ నేతలు

జగ్గయ్యపేట అర్బన్: అక్కచెల్లెమ్మల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న పాలన సాగుతోందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో మహిళా సాధికార విప్లవానికి నాంది పలికారని ఉదయభాను అన్నారు. ఆదివారం సాయంత్రం జగ్గయ్యపేట పట్టణంలోని ఉక్కు కళావేదికలో పేట పట్టణ పరిధిలో వైఎస్సార్ ఆసరా 3వ విడత నగదు చెక్కును ఉదయభాను, ఆయన సతీమణి సామినేని విమలాభాను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్కచెల్లెమ్మల విశ్వాసమే జగన్‌కు శ్రీరామ రక్ష అన్నారు. ప్రతి మహిళను లక్షాధికారులను చేయాలనే దిశగా జగనన్న పాలన అడుగులు వేస్తుందన్నారు. మహిళాసాధికార సాధనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి మహిళా ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.47 కోట్ల 97 లక్షలు వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి చేకూరితే అందులో పేట పట్టణంలో ఉన్న 7,317 పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు రూ.6 కోట్ల 14 లక్షలు లబ్ధి చేకూరిందని తెలిపారు. విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, నూకల సాంబ, రోశయ్య, గింజుపల్లి వెంకట్రావు, సుందరమ్మ, ఖాదర్ బాబు, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్లు నంబూరి రవి, కృష్ణవేణి, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మునిహేరా, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు చారుగుంట్ల కొండ, పరంధామ, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, మెప్మా సీఎంఎం సుజాత, సీఈవోలు, ఆర్పీలు, పొదుపు సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రతి గడపకూ చేరాలి

ఎమ్మెల్సీ అరుణకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయాలు చేయటమే కాకుండా ప్రజల ఇళ్ల ముంగిటకు ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. స్థానిక శ్రీకరం కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో సచివాలయ కన్వీనర్‌లు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 14 వరకు సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ఈ నాలుగేళ్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. అర్హత ఉండి పథకాలు అందని వారికి పథకాలు అందించేలా కృషి చేయాలని తెలిపారు. రానున్న ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో పార్టీ విజయం సాధించబోతుందన్నారు. నియోజకవర్గంలో 30 ఏళ్లలో టీడీపీ చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు హయాంలో నాలుగేళ్లలో చేసి చూపించామని పేర్కొన్నారు. నందిగామ పట్టణంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధితో పాటు డ్రైన్‌ల నిర్మాణం, తదితర అభివృద్ధిని చేసి చూపించామని తెలిపారు. నాలుగేళ్ల పాలనలో ప్రతి ఒక్క గ్రామంలో అభివృద్ధి వివరాలతో సహా పోస్టర్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయనంత అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపుతున్నా ప్రతిపక్షాలు మాత్రం విషం చిమ్ముతూనే ఉన్నాయని అరుణకుమార్ తెలిపారు. వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, పార్టీ పట్టణ, మండల కన్వీనర్‌లు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మంచాల చంద్రశేఖర్, వేమా సురేష్‌బాబు, నన్నపనేని నరసింహారావు, ఆవుల రమేష్‌బాబు, కందుల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, నాయకులు కోటేరు సూర్యనారాయణరెడ్డి, బొల్లినేని శ్రీనివాసరావు, బుగ్గినేని సురేష్, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి కృషి



చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఉదయభాను

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): మత్స్య పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గ్రామంలోని చెరువులో మత్స్య శాఖ ఆధ్వర్యంలో 1.75 లక్షల చేప పిల్లలను ఆదివారం మత్స్య శాఖాధికారులతో కలిసి ఆయన చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య రైతులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని అధైర్య పడవద్దని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎన్నడూ లేని విధంగా మన ప్రాంతంలోని చేపలను విదేశాలకు సైతం ఎగుమతి చేసేలా పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. అర్హులైన మత్స్యకారులకు చేపలు పట్టేందుకు అవసరమైన వలలు, పడవలను అందిస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఆక్వా హబ్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. గండ్రాయి గ్రామంలోని చెరువులో 65 వేలు, జగ్గయ్యపేట పట్టణంలోని ఊర చెరువులో 55 వేల చేప పిల్లలను వదిలినట్లు చెప్పారు. కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మత్స్యశాఖ డీడీలు అయ్యనాగరాజు, శ్రీనివాస నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ సౌభాగ్య చక్రాణి, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబు, ఎఫ్ఎం రంగారావు, వీఎఫ్ఏ గోపీనాథ్, రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు రాఘవ, లింగనబోయిన వెంకట గోపాల్, గ్రామ నాయకులు సతీష్‌శర్మ, గుర్రం నరసింహారావు, చలమల శ్రీనివాసరావు, ఆదినారాయణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..



శ్రీనివాసరావుకు కండువాకప్పి ఆహ్వానిస్తున్న సర్పంచ్ లక్ష్మీనారాయణ, తదితరులు

వేములనర్వ(వత్సవాయి): గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ నాయకుడు కుక్కల శ్రీనివాసరావు టీడీపీకి రాజీనామా చేసి ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని శ్రీనివాసరావు తెలిపారు. గ్రామ సర్పంచ్ పాదిలి లక్ష్మీనారాయణ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఆదాం, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీను, మాజీ సర్పంచ్ శాంతయ్య, గ్రామ పార్టీ నాయకులు కమతం రాములు, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా విద్యా శాఖాధికారి సి.వి.రేణుక
- డివిజన్ పరిధిలో మొత్తం 65 పరీక్ష కేంద్రాలు



పట్టణంలోని పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది



బల్లలపై నంబరు స్టిక్కర్లు అంటిస్తున్న ఉపాధ్యాయులు

నందిగామ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యా శాఖాధికారిణి, నందిగామ డివిజన్ ఇన్చార్జి ఉప విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉప విద్యా శాఖాధికారి కార్యాలయ పరిధిలోని 13 మండలాల నుంచి మొత్తం 8804 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. ఇందుకోసం 65 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు వివిధ కేటగిరీల నుంచి 803 మంది సిబ్బంది సేవలందిస్తారన్నారు. విద్యార్థులు స్వేచ్ఛగా, ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పరీక్షా సమయంలో విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం కల్పించామన్నారు.ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటితోపాటు విధిగా ఏఎన్ఎంను అందుబాటులో ఉంటారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

కంచికచర్ల: కంచికచర్లలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆదివారం ఎంఈఓ లావుడ్యా చిట్టిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచికచర్ల మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కంచికచర్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విజయరాణి హైస్కూల్‌లో 1, 2 సెంటర్లు, శ్రీ అక్షరస్కూల్‌లో-1, మండలంలోని పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో- 1 సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 994 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఇన్విజిలేటర్లు 60 మందిని నియమించామన్నారు. తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: పదో తరగతి పరీక్షల ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈఓ డీ రవీంద్ర ఆదివారం తెలిపారు. సోమవారం నిర్వహించే పరీక్షలకు సంబంధించి పరీక్ష కేంద్రాల్లో బల్లలు, ఫ్యాన్లు, లైట్స్, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. వాచ్‌లు, సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలను పరీక్ష హాలులోకి అనుమతి లేదననారు. విద్యార్థులు స్కూల్ యూనిఫాంతో పరీక్షలకు హాజరు కాకూడదని, సివిల్ డ్రెస్ ధరించి మాత్రమే రావాలన్నారు. ఒక నిముషం ఆలస్యం అయినా అనుమతించరన్నారు. మండలంలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాల్లో 484 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు.

పట్టణంలో 7 సెంటర్లు..

హాజరు కానున్న 1,155 మంది విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్ : సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పట్టణంలోని అన్ని సెంటర్లలో ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈవో డి.రవీంద్ర తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేట పట్టణంలో 7 సెంటర్లను ఏర్పాటు చేయగా, మొత్తం 1,155 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. 120 మంది ఉపాధ్యాయ సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. పాఠశాలల పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అన్ని స్కూళ్లలో సీసీ ఫుటేజి వ్యవస్థ పని చేస్తుందన్నారు. పేట మండలంలో గండ్రాయి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 217 మంది, చిల్లకల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 163 మంది, చిల్లకల్లు ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో 141 కలిపి 3 సెంటర్లకు గాను 521 మంది విద్యార్థులను ఎలాట్ చేసినట్లు ఎంఈవో రవీంద్ర తెలిపారు.



ఎంఈవో రవీంద్ర

ఘనంగా మట్టల ఆదివారం



ప్రదర్శనలో చైర్మన్ డాక్టర్ రాజు, కమిటీ సభ్యులు



మక్కపేటలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



రామిరెడ్డిపల్లి గ్రామంలో ర్యాలీ

జగ్గయ్యపేట అర్బన్ : మట్టల ఆదివారం వేడుకలు పట్టణంలో పలు చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌సిఎం చర్చిలో ఫాదర్ స్వామినాథం ఆధ్వర్యంలో మత గురువులు, సిస్టర్స్, సంఘపెద్దలు, సంఘస్తులు ఈత మట్టలు ధరించి చర్చి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్న, సంఘ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, రవి, సురేష్, కిరణ్, చార్లెస్, సిస్టర్లు, మరియదళ సభ్యులు పాల్గొన్నారు. పోస్టాఫీసు వద్ద ఉన్న సెయింట్ థామస్ సీఎస్‌ఐ టౌన్ చర్చిలో డీనరీ చైర్మన్ డాక్టర్ డి.రాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. చర్చి కమిటీ ప్రతినిధులు ఎంపీపీ జోసఫ్, పాకలపాటి కనకరాజు, పి.ఇమ్మానుయేలు, కనపర్తి ప్రభాకర్, ఎంవీ.దేవరాజు, జె.కుమార్‌బాబు, ఉమెన్స్ ఫెలోషిప్, సండేస్కూల్, యూత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. విలియంపేట సీఎస్‌ఐ చర్చిలో డీనరీ చైర్మన్ జయరాజు, క్రిస్టియన్‌పేటలోని సీఎస్‌ఐ చర్చిలో డీసీ గంధ రవి ఆధ్వర్యంలో, బలుసుపాడు రోడ్డులోని బేతేలు చర్చి, కోదాడ రోడ్డులోని బేతెస్థ ప్రార్థనామందిరంలో ఈత మట్టలకు పూలు అలంకరించి ప్రదర్శనలు నిర్వహించారు. పలు చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. బలుసుపాడు గ్రామంలో సీఎస్‌ఐ చర్చి, ఆర్‌సీఎం చర్చిలలో మట్టల ఆదివారం ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. సీఎస్‌ఐ విలియంపేట డీనరీ చైర్మన్ సీహెచ్.జయరాజు, సంఘ పెద్దలు మైల నయోమి, యశోద, సునీత, జయరాజు, గాంధీ, ఆర్‌సీఎం చర్చి ఉపదేశి చార్లెస్ మాస్టర్, సంఘ పెద్దలు గండమాల మరియన్న(వెంకటి), మైల మేరి వినీత, ఉప్పుతోళ్ల బాలస్వామి, సంఘస్తులు పాల్గొన్నారు.

క్రైస్తవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు

కంచికచర్ల : మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని సీఎస్‌ఐ దేవాలయ పాస్టర్ ఎం.జాన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఈస్టర్ పండుగకు ముందుగా వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారం అంటామన్నారు. క్రీస్తు ఎరుసలేమ్ దేవాలయాన్ని చివరిగా సందర్శించిన ఆదివారం అన్నారు. మట్టల ఆదివారంనాడు ఎరుసలేములో ఓ రక్షకుడుగా, ఓ రారాజుగా అడుగుపెడతాడని, ప్రజలందరూ జేజేలు కొడుతూ క్రీస్తును ఆరాధిస్తారన్నారు. ఖర్జూర, ఈత, కొబ్బరి మట్టలకు రకరకాల పూలు అమర్చి గ్రామ పురవీధుల్లో క్రీస్తు రాజుకు హోసన్నా, హోసన్నా, దావీదు కుమారుడా జయం అంటూ జయ జయ ధ్వనులు పలుకుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారన్నారు. కంచికచర్ల ఆర్సీఎం, సీఎస్‌ఐ దేవాలయాలతో పాటు మండలంలోని క్రైస్తవ దేవాలయాల్లో విశ్వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

వత్సవాయి: క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈత మట్టలను రంగు రంగు పూలతో అందంగా అలకరించి గ్రామంలో పాటలు పాడుకుంటూ దేవుని నామస్మరణ చేసుకుంటూ గ్రామోత్సవం నిర్వహించుకున్నారు. మహిళలు చర్చిల వద్దకు చేరకున్నారు. అనంతరం అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. మట్టల ఆదివారం సందర్భంగా వత్సవాయి, దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, మక్కపేట తదితర గ్రామాల్లో చర్చిల వద్ద మత బోధకులు భక్తులకు సందేశాన్ని అందించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు.

నందిగామ: ఈస్టర్ పండుగకు ముందు వచ్చే మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రార్థన మందిరాల ఆధ్వర్యంలో ఈత, తాటి ఈనెలతో ర్యాలీలు నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రార్థన మందిరాల ఆధ్వర్యంలో సందడి చేశారు. ఈత కొమ్మలకు పలు రకాల పూలను అలంకరించి, అందంగా ముస్తాబు చేసి ఏసును కీర్తిస్తూ, సన్నుతి గీతాలు ఆలపిస్తూ, ర్యాలీలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు, ఆర్‌సీఎం సంస్థ ఆధ్వర్యంలో దివ్య బలి పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. నందిగామ, చందర్లపాడు మండలాల పరిధిలోని అన్ని ప్రార్థన మందిరాల్లో పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

మహనీయుల సంగీత సేవలు ఆదర్శం



వయోలిన్ కచేరి నిర్వహిస్తున్న దుర్గాప్రసాద్ బీవీఎస్ ప్రసాద్, హనుమంతరావు

విజయవాడ కల్చరల్: మహనీయుల సంగీత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోహనరావు అన్నారు. స్వరఝరి సంగీత సంస్థ మూడు రోజులుగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న 35 వార్షిక సంగీత మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌కు చింతలపాటి రాజ్యలక్ష్మి పురస్కారం, దుర్గాప్రసాద్ సప్తతంత్రీ వాయులీన కచేరీ నిర్వహించారు. సుమతీ రామ్మోనరావు మాట్లాడుతూ ద్వారం వెంకస్వామి నాయుడు సంగీత వారసత్వాన్ని కాపాడుతూ నిజమైన కళాకారుడుగా సంగీత సరస్వతికి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సత్కార కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్‌తోపాటు పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. దుర్గాప్రసాద్ నిర్వహించిన వాయిలీన కచేరీలో పలు సంప్రదాయ కీర్తనలు చోటుచేసుకున్నాయి. బీవీఎస్ ప్రసాద్ మృదంగంపై, ఎస్ హనుమంతరావు ఘటంపై సహకరించారు.

'చట్టసభల్లో గోదావరి గళం' పుస్తకావిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన రాజమండ్రికి చెందిన శ్రీపాద శ్రీనివాస్ రచించిన 'చట్టసభల్లో గోదావరి గళం' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది.వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, ఎంఎల్ఎస్ ప్రసాద్ బాబు, అసోసియేషన్ కార్యదర్శి నరసరాజు, గుండు జనార్దన్, యర్రంశెట్టి శ్రీనివాసరావు, రాము చిదంబరం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత శ్రీపాద శ్రీనివాస్‌కు చిరు సత్కారం చేసి అభినందించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



పౌరాణిక నాటకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అన్నవరం(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జానపద, పౌరాణిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ మీగడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కృష్ణవేణి, గ్రామ పెద్దలు వెంకట్రావు, గోవింద్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, శివపాదం, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.